క్లుప్తంగా

బాల్య వివాహాలు చేస్తే చర్యలు



బాల్య వివాహాలపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఉరవకొండ: అమ్మాయిలకు 18 ఏళ్లు, అబ్బాయిలకు 21 ఏళ్లు పూర్తయితేనే పెళ్లి చేయాలని, బాల్య వివాహాలు చేస్తే కఠిన శిక్షలు అమలవుతాయని రాకెట్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వెంకటేష్‌నాయక్ తెలిపారు. గురువారం రాకెట్ల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్‌ఎండీ షఫీ మాట్లాడుతూ తల్లిదండ్రులు మగ పిల్లలపై మోజుతో గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకొని ఆడ శిశువు అయితే అబార్షన్ చేయించుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శేఖర్, స్వర్ణలత పాల్గొన్నారు.

సరస్వతీ పుత్రికకు సత్కారం



షీజాను సత్కరిస్తున్న నాయకులు

ఉరవకొండ: పది ఫలితాల్లో జిల్లా టాపర్‌గా నిలిచిన ఉరవకొండ వివేకానంద ఇంగ్లిషు మీడియం హైస్కూల్ విద్యార్థి షీజాకు నూర్‌బాష మహమ్మద్ దూదేకుల సంక్షేమ సంఘం అధ్వర్యంలో గురువారం సత్కరించారు. ఉరవకొండకు చెందిన ఏఎస్‌ఐ బాబయ్య, శర్మాస్‌బేగం దంపతుల కుమార్తె షీజా పది ఫలితాల్లో 596 మార్కులు సాధించింది. దీంతో సంఘం అధ్యక్షులు తయాబ్ మాట్లాడుతూ జిల్లా టాపర్‌గా నిలిచిన దూదేకుల కులానికి చెందిన షీజా భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం షీజాకు షీల్డ్ అందించి సత్కరించారు. సంఘం ఉపాధ్యక్షుడు గంగవరం శర్మాస్, టైలర్ శర్మాస్, కమిటీ నాయకులు సిద్దయ్య, దస్తగిరి, బాష, బాబు, ఫకృద్దీన్, షముద్దీన్, వన్నూర్‌వలి, జాఫర్‌లు పాల్గొన్నారు.

విద్యార్థినికి సన్మానం

బొమ్మనహాళ్: స్థానిక జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని విజ్ఞా కార్తీకను ఎంపీడీఓ విజయభాస్కర్, తహసీల్దార్ మునివేలు, ఈఓపీఆర్‌డీ దాస్, పశువైద్యాధికారి వెంకటరెడ్డి గురువారం సన్మానించారు. కార్పొరేట్‌కు దీటుగా పది ఫలితాల్లో 575 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలవడం అభినందనీయమన్నారు. సీనియర్ , జూనియర్ అసిస్టెంట్లు హనుమంతప్ప,గౌరిశంకర్,కార్యదర్శి శివన్న, ఎంఆర్సీ మంజప్ప పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందనలు

బెళుగుప్ప: మండల పరిధిలోని ఎర్రగుడికి చెందిన తలారి అంజినేయులు, సరోజ కుమార్తె ఇందు పదోతరగతి ఫలితాల్లో 585 మార్కులు సాధించడంతో ఎంఈఓ మల్లారెడ్డి గురువారం అభినందించారు. ఇందు గుత్తిలోని బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో పదోతరగతి చదివింది.

ఆటోలకు నంబర్ తప్పనిసరి



ఆటో డ్రైవర్లకు సూచనలు ఇస్తున్న సీఐ

కళ్యాణదుర్గం : పట్టణంలోని ఆటోలకు సీరియల్ నంబర్ తప్పనిసరి అని పట్టణ సీఐ యువరాజు సూచించారు. ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు ఆధ్వర్యంలో కళ్యాణదుర్గం టౌన్ ఇన్‌స్పెక్టర్ యువరాజు ఆటో డ్రైవర్లకు గురువారం పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ కళ్యాణదుర్గం టౌన్ పోలీస స్టేషన్ పరిధిలో ఉన్న ఆటో లకు అన్నింటికీ పోలీస్ స్టేషన్‌లో ఇచ్చే సీరియల్ నెంబర్ స్టిక్కర్ వేయించుకోవాలన్నారు. ప్రతి ఆటో డ్రైవర్ యూనిఫాం వేసుకోవాలని, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు.

బోల్తాపడిన వరి బస్తాల లారీ

కళ్యాణదుర్గం : బోరంపల్లి గ్రామం వద్ద బైపాస్‌లోని ఆంజనేయస్వామి ఆలయం ఎదురుగా వరి బస్తాల లారీ గురువారం బోల్తాపడింది. అనంతపురం వైపు నుంచి రాయదుర్గం వైపు వెళ్తుండగా అదుపు తప్పి బోల్తా పడింది. అయితే ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. అనంతరం ఉదయం మరో వాహనంలో బస్తాలను తరలించారు.

ఒకే ఈతలో నాలుగు మేకల పిల్లలు!



గుమ్మఘట్ట: మండలంలోని రంగచేడు గ్రామానికి చెందిన సిద్దయ్యగారి మల్లికార్జున పెంచుతున్న మేక ఒకే ఈతలో నాలుగు పిల్లలకు జన్మనిచ్చింది. అంతకు ముందుకు కూడా ఇదే మేక మూడు పిల్లలకు జన్మనిచ్చిన విషయం తెలిసిందే. పుట్టిన నాలుగు పిల్లలు క్షేమంగా ఉండడంతో గ్రామస్తులు ఆసక్తిగా గమనించారు. అధిక హార్మోన్ల ప్రభావంతో అండాలు అధికంగా ఉత్పత్తి అయినప్పుడు ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటాయని పశు వైద్యాధికారి నవీన్‌కుమార్ పేర్కొన్నారు.

టిడ్కో ఇళ్లకు మోక్షమెన్నడో?

- నిధులు విడుదల కాక ఆగిన నిర్మాణాలు
- రాయదుర్గంలో 95 శాతం పనులు పూర్తి
- మరో 5 శాతం పనులు చేపట్టడంలో కూటమి సర్కార్ నిర్లక్ష్యం
- 21 బ్లాకుల్లో 1,008 మంది లబ్ధిదారులు
- పేదలను ఊరిస్తున్న సొంతింటి కల



రాయదుర్గంలో టిడ్కో ఇళ్లు

రాయదుర్గం: పట్టణంలోని మల్లాపురం లేఔట్ సమీపాన జరుగుతున్న టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 95 శాతం పనులు పూర్తయ్యాయి. సార్వత్రిక ఎన్నికలు రావడంతో మిగిలిన 5 శాతం పనులు ఆగిపోయాయి. తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం..ఈ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లడంలో జాప్యం చేస్తోంది. దీంతో పేదలకు సొంతింటి కల ఊరిస్తోంది.

2018–19 మధ్య కాలంలో 21 బ్లాకులుగా విభజించి 1008 టిడ్కో ఇళ్లు 300 చదరపు అడుగుల్లో నిర్మించేలా కార్యాచరణ చేపట్టారు. వీటి కోసం రూ.46.83 కోట్లు కేటాయించారు. ప్రస్తుతం 95 శాతం పనులు పూర్తయాయి. మిగిలిన ఐదు శాతం టైల్స్, పెయింట్, ఎలక్ట్రికల్, ఇతర ప్లంబర్ పనులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నిర్మాణాలు పూర్తిచేయాలంటే పెండింగ్‌లో ఉండే రూ.10 కోట్ల బిల్లులు సత్వరం విడుదల చేయాలి. అప్పుడే లబ్ధిదారుల కల సాకరమవుతోంది. పాలకులు, అధికారులు ఈ దిశగా కృషి చేయాల్సి ఉంది.

ఒక్క రూపాయితోనే రిజిస్ట్రేషన్

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద ఒక్క రూపాయికే టిడ్కో గృహాలను కేటాయించిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కింది. రూపాయితో 1,008 ఇళ్లకు ఉచితంగా రిజిస్ట్రేషన్ పూర్తిచేసి కొండత భరోసా ఇచ్చారు. పేదోడి ఆత్మగౌరవాన్ని నిలబెట్టారు. ఇళ్ల నిర్మాణాలతో పాటు తగిన మౌలిక సౌకర్యాలకు శ్రీకారం చుట్టారు. కొద్దో గొప్పో పెండింగ్ పనులు పూర్తిచేస్తే 1,008 మంది లబ్ధిదారులకు గూడు కల్పించే బాధ్యత కూటమి సర్కార్ తీసుకోవాల్సి ఉంది. ఆ దిశగా లబ్ధిదారులంతా ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.

ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం



సొంతింటి కల సాకరం కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్నాను. ప్రతి నెలా రూ.2,500 అద్దె చెల్లించుకోలేక ఇబ్బందులు పడుతున్నాను. పూలు అల్లుతూ జీవనం చేసే నాకు అద్దె కష్టాలు వెంటాడుతోంది. ప్రభుత్వం త్వరగా ఇల్లు నిర్మాణం పూర్తి చేసి అప్పగించాలి.

– హుసేన్‌బీ, టిడ్కో లబ్ధిదారురాలు, రాయదుర్గం

అద్దె ఇల్లే దిక్కు



టిడ్కో ఇల్లు మంజూరైంది. నిర్మాణం కూడా దాదాపు పూర్తయ్యింది. పెయింట్, టైల్స్, ఎలక్ట్రిక్ పనులు మాత్రమే పెండింగ్ ఉన్నాయి. ఆ పనులు త్వరగా పూర్తిచేసి అప్పగించాలి. పూలు అల్లికతో జీవనం చేసే తనకు ప్రతి నెలా అద్దె చెల్లించడం కష్టంగా మారింది. అధికారులు, పాలకులు చొరవచూపాలి.

– షానుబీ, టిడ్కో లబ్ధిదారు, రాయదుర్గం

త్వరలో పూర్తిచేస్తాం

టిడ్కో ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసేలా కృషి చేస్తాం. ఇప్పటికే ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. పెయింట్, టైల్స్, ఎలక్ట్రిక్, ఇతర చిన్న చిన్న మరమ్మతులు మాత్రమే పెండింగ్ ఉన్నాయి. రూ.10 కోట్ల వరకు బిల్లులు వరకు పెండింగ్‌లో ఉన్నాయి. త్వరలో విడుదల చేసే అవకాశం ఉంది. లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. పనులు పూర్తి చేసి అప్పగించేలా కృషి చేస్తాం.

– సుధారాణి, టిడ్కో ఈఈ, అనంతపురం

శెట్టూరు ఏపీఎంపై చర్యలు తీసుకోండి



కళ్యాణదుర్గంలో ఆర్డీఓ వసంతబాబుకు వినతి పత్రం సమర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కళ్యాణదుర్గం: అంబేడ్కర్‌ను అవమానించిన శెట్టూరు ఏపీఎం గంగన్నపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ జేఏసీ, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆర్డీఓ వసంతబాబును కోరారు. గురువారం ఆర్డీఓ కార్యాలయంలో నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ నెల 15న జరిగిన సర్వసభ్య సమావేశంలో తహసీల్దార్, ఎంపీడీఓ, ప్రజా ప్రతినిధులైన ఎంపీపీ, జెడ్పీటీసీ ఇతర సభ్యుల సమక్షంలో అంబేడ్కర్ జయంతిపై అవమానంగా మాట్లాడిన ఏపీఎంపై చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీఎంపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ జేఏసీ తాలుకా అధ్యక్షులు చలిమప్ప, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు దొణస్వామి, అనుంపల్లి రామన్న, చింతర్లపల్లి మైలారప్ప పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన పోలీస్ క్వార్టర్స్



కూలడానికి సిద్ధంగా ఉన్న ఎస్‌ఐ క్వార్టర్స్



కూలడానికి సిద్ధంగా ఉన్న క్వార్టర్స్

- ప్రతిపాదనలకే పరిమితం
- అద్దె గదుల్లో ఉంటూ సిబ్బంది అవస్థలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



శిథిలావస్థకు చేరిన సిబ్బంది క్వార్టర్స్

ఉరవకొండ: ఉరవకొండ పోలీస్ అర్బన్, రూరల్ సర్కిల్ సిబ్బందికి క్వార్టర్స్ లేక అవస్థలు పడుతున్నారు. 40 ఏళ్ల క్రితం నిర్మించిన గదులు ప్రస్తుతం శిథిలావస్థకు చేరాయి. సీఐ, ఎస్‌ఐలతో పాటు సిబ్బందికి ప్రత్యేకంగా నిర్మించిన క్వాటర్స్ కూలిపోయి అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయి. నూతన గదుల నిర్మాణంపై అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో సిబ్బంది అద్దె గదుల్లో ఉంటూ అవస్థలు పడాల్సి వస్తోంది. రూరల్ స్టేషన్ పరిధిలో వజ్రకరూరు, విడపనకల్లు, పాల్తూరు, బెళుగుప్ప పోలీస్ స్టేషన్‌లు ఉన్నాయి. రూరల్ సీఐ పరిధిలో నలుగురు ఎస్‌ఐలు, ఐదుగురు ఏఎస్‌ఐలు, 180 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు ఉన్నారు. ఉరవకొండ అర్బన్ సీఐ పరిధిలో ఒక సీఐ, ఒక ఎస్‌ఐతో పాటు 25 మంది కానిస్టేబుళ్లు ఉన్నారు.

నూతన క్వార్టర్స్ ప్రతిపాదనలకే పరిమితం..

ఉరవకొండ పోలీస్ స్టేషన్ నిర్మాణం 1971 ఏప్రిల్‌లో ప్రారంభమైంది. అనంతరం ఉరవకొండ రూరల్ పోలీస్ స్టేషన్ నిర్మాణం 2001లో అప్పటి ఎస్పీ అంజనాసిన్హా చేతుల మీదుగా ప్రారంభించారు. ఉరవకొండ పోలీస్ క్వాటర్స్ నిర్మాణం 1980 ఫిబ్రవరి నెలలో నిర్మించారు. ఈ క్వార్టర్స్ నిర్మాణంలో భాగంగా కానిస్టేబుళ్లకు 20 గదులు, సీఐ, ఎస్‌ఐలకు ప్రత్యేక క్వార్టర్స్ నిర్మించారు. క్వార్టర్స్ శిథిలావస్థకు చేరడంతో వాటిని మరమ్మతులు చేయడానికి నిధులు మంజూరు చేయలేదు. దీంతో సిబ్బంది క్వార్టర్స్ ఖాళీ చేయాల్సిన పరిస్థితి వచ్చింది. పోలీసులు అద్దె గదుల్లో ఉంటూ విధులకు హాజరవుతున్నారు. ఇప్పటికైనా కొత్త క్వార్టర్స్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సిబ్బంది కోరుతున్నారు.

ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం

ఉరవకొండలో శిథిలావస్థకు చేరిన క్వార్టర్స్ స్థానంలో కొత్త క్వాటర్స్ నిర్మించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. 40 ఏళ్ల కాలం నిర్మించిన క్వార్టర్స్ పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. ప్రభుత్వం నుంచి నిధులు మంజురు కాగానే పనులు ప్రారంభిస్తాం.

– శ్రీనివాస్, డీఎస్పీ, గుంతకల్లు

ఉగ్రదాడి పాశవిక చర్య



కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కణేకల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజలు

రాయదుర్గం: జమ్మూకాశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడి అత్యంత పాశవిక చర్య అని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప ఖండించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు గురువారం పట్టణంలోని రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహం నుంచి వినాయక సర్కిల్ వరకు పట్టణ, మండల కన్వీనర్లు మేకల శ్రీనివాసులు, జీ రామాంజనేయులు, చేనేత విభాగం, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శులు పొరాళ్ల శివా, బీటీపీ గోవిందు, అధికార ప్రతినిధి మాధవరెడ్డి, ఐటీసెల్ అధ్యక్షుడు ఆనందరెడ్డి, పట్టణ అధ్యక్షురాలు శారద, కౌన్సిలర్లు, పార్టీ నాయకులతో కలసి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఉగ్రదాడికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శించారు. వారు మాట్లాడుతూ పర్యాటకులే లక్ష్యంగా జరిగిన ఈ దాడుల్లో 27 మంది ప్రాణలు కోల్పోవడం, మరో 20 మంది పరిస్థితి విషమంగా మారడం అమానవీయ చర్య అని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రీలక్ష్మి, గౌని లావన్య, ఐనాపుపురం మంజునాథ, పొరాళ్ల గోవిందరాజులు, మైనార్టీ నాయకుడు దిలవర్‌బాష, వైఎస్సార్‌సీపీ నాయకులు శివారెడ్డి, ఆర్టీ కాంతారెడ్డి, గౌని శ్రీరామిరెడ్డి, నిజామ్, బషీర్, పైతోట రఘు, రాజగోపాల్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలోనూ ఉగ్రదాడికి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు.

కణేకల్లులో క్యాండిల్ ర్యాలీ

కణేకల్లు: కాశ్మీర్‌లోని పహల్గాం ప్రాంతంలో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని గురువారం రాత్రి స్థానిక ప్రజలు క్యాండిల్ ర్యాలీ చేశారు. దిగువవీధి నుంచి బస్టాండ్ వరకు క్యాండిళ్లు చేతపట్టుకొని ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన దాడి పిరికిపంద చర్యని ప్రజలు ఖండించారు. కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదులకు తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలు డిమాండ్ చేశారు.

రుక్మిణీ పాండురంగ స్వామికి ఏకాదశి పూజలు



అలంకరణలో రుక్మిణీ పాండురంగస్వామి

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన ఉంతకల్లు రుక్మిణీ పాండు రంగస్వామికి గురువారం ఏకాదశి పూజలు వైభవంగా జరిగాయి. ఉదయం 6 గంటలకు ప్రత్యేక జలంతో స్వామివారికి వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక అభిషేకం చేశారు. అనంతరం స్వామికి పుష్పాలకరణ, కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ చేశారు. ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి తులసీ మాలధారణకు భక్తులు పోటెత్తారు.

విత్తన వేరుశనగ అందజేయాలి

కుందుర్పి: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన తరుణంలో అదునుకు ముందుగానే రైతులకు వేరుశనగ విత్తనం అందజేయాలని మండల రైతు సంఘం నాయకులు వ్యవసాయ అధికారి మహేష్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. మరో 25 రోజుల్లో రైతులకు పొలాల్లో విత్తనం సాగు చేస్తారని ఈలోగా సబ్సిడీ విత్తన వేరుశనగ కాయలు ఇవ్వాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో రైతు సంఘం నాయకులు హనుమంతప్ప, లక్ష్మీపతి, నరసింహ, అతావుల్లా, ఓబన్న తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులపై కుక్క దాడి

బొమ్మనహాళ్: మండలంలోని తారకాపురంలో ఇద్దరు చిన్నారులపై కుక్క దాడి చేసింది. గ్రామానికి చెందిన హెచ్.హనుమంతు కుమార్తె శిరిష, వరుణ్ కుమార్తె పల్లవిలపై కుక్క దాడి చేసి గాయపరిచింది. గాయపడిన చిన్నారులను కుటుంబ సభ్యులు ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రి తీసుకెళ్లారు.

ఉగ్రదాడి అమానుషం

- ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి



ఉరవకొండ: జమ్ముకాశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడి అమానుషమని శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి తెలిపారు. గురువారం ఆయన ఓ ప్రకటనలో ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో 25 మంది మరణించిన విషయం తెలిసి తీవ్ర భావోద్వేగానికి లోనయ్యాయన్నారు. సైనిక దుస్తుల్లో వచ్చిన ఉగ్రవాదులు పర్యాటకులపై దాడులకు తెగబడటం తీవ్ర భయానక పరిస్థితిలో దేశాన్ని నెట్టేసిందన్నారు. బాధిత కుటుంబాలు, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. దోషులను శిక్షించాలని, బాధితులు న్యాయం చేయాలని ఆయన కోరారు.

నీటి సమస్య పరిష్కారం



కొళాయిలకు సరఫరా అవుతున్న నీరు

సాక్షి ఎఫెక్ట్..

కూడేరు: ఉదిరిపికొండలో తాగునీటి సమస్య తీరింది. బుధవారం 'ఉదిరిపికొండలో తాగునీటికి అవస్థలు' శీర్షికన 'సాక్షి'లో వార్త ప్రచురితమైంది. అధికారులు స్పందించి గురువారం సమస్యను పరిష్కరించారు. పంచాయతీ తరఫున ఏర్పాటు చేసిన మోటార్‌కు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నాగదివ్య, పంచాయతీ అధికారులు మరమ్మతులు చేయించారు. దీంతో గ్రామం సగ భాగానికి పైగా తాగునీరు సరఫరా అయింది. ఉరవకొండ తాగునీటి ప్రాజెక్ట్ పైపులైన్ లీకేజీలకు మరమ్మతుల పనులు కొనసాగుతున్నాయని శుక్రవారం లోపు ప్రాజెక్ట్ నీరు సరఫరావుతుందని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ తెలిపారు.

శేషవాహనంపై శ్రీవారు



శేష వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు

బొమ్మనహాళ్: మండల కేంద్రంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి గురువారం శేష వాహనంపై విహరించారు. వేదపండితులు జలాభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక అలంకరణ చేశారు. తీర్థప్రసాదాలు, అన్న సంతర్పణ చేశారు. గ్రామ వీధుల్లో స్వామివారిని ఊరేగించారు. రాత్రి 8 గంటలకు శేషవాహనంపై స్వామిని ఊరేగించారు.

పారదర్శకంగా పంపిణీ చేయాలి

కళ్యాణదుర్గం : రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ బాలకిషన్ సూచించారు. గురువారం కంబదూరు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ బాలకిషన్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి చౌకదుకాణాల ద్వారా కార్డులకు అందాల్సిన బియ్యం, రాగులు, చక్కెర పంపిణీ చేయాలని డీలర్లకు సూచించారు. అక్కడక్కడ తూకాల్లో అవకతవకలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. వేలి ముద్రలు పడని కార్డుదారుల నుంచి ఈ నెలాఖరులోపు ఈకేవైసీ చేయించాలన్నారు. సమావేశంలో సీఎస్‌డీటీ రాజశేఖర్ , స్టాకిస్ట్ మహబూబ్ బాషా, మండల డీలర్ల సంఘం అధ్యక్షుడు రఫీ తదితరులు పాల్గొన్నారు.

డ్రిప్పు పరికరాలకు నిప్పు

రాయదుర్గం: మెచ్చిరిలో విటల్ అనే రైతుకు చెందిన రెండెకరాల్లో డ్రిప్ పరికరాలకు గుర్తు తెలియని వ్యక్తులు గురువారం నిప్పుపెట్టారు. డిప్పు వైరు, పై పులు, వాల్వ్‌లు కాలిపోవడంతో సుమారు రూ.2ల క్షల వరకు నష్టపోయినట్లు బాధితుడు వాపోయాడు.

ఉపాధి కూలీకి పాము కాటు

బొమ్మనహాళ్: గోనేహాళ్ వద్ద ఉపాధి పనుల వద్ద నాగవేణి అనే మహిళ పాము కాటుకు గురైంది. గురువారం ఉదయం కాలువ పనులు చేస్తుండగా విషసర్పం కాటేయడంతో తోటి కూలీలు ఆమెను వెంటనే కణేకల్లులోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స అనంతరం ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు నిర్ధారించి, ఇంటికి పంపారు. విషయం తెలుసుకున్న ఎంపీడీఓ విజయభాస్కర్, ఈఓఆర్‌డీ దాస్.. ఆ గ్రామానికి వెళ్లి బాధితురాలిని పరామర్శించారు. ఆమె ఆరోగ్య స్థితిని అడిగి తెలుసుకున్నారు.

గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి



ఉరవకొండలో పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న సర్పంచ్, ఎంపీడీఓ, ఈఓలు



బెళుగుప్పలో పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న దృశ్యం



బొమ్మనహాళ్‌లో మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయభాస్కర్

ఉరవకొండ: ఉరవకొండ మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. పంచాయతీ ఈఓ గౌస్‌సాహెబ్ ఆధ్వర్యంలో సర్పంచ్ మీనుగ లలితమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సర్పంచ్ మాట్లాడారు. అనంతరం పారిశుధ్య కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవిప్రసాద్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

కూడేరు: గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యపడుతుందని ఎంపీడీఓ కుళ్లాయిస్వామి తెలిపారు. గురువారం కూడేరులోని ఎంపీడీఓ కార్యాలయంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఎంపీడీఓ కుళ్లాయిస్వామి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నాగదివ్య, ఈఓఆర్డీ రాధాకృష్ణ, ఏపీఓ పోలేరయ్య , పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. మండల వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లోనూ జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని జరుపుకున్నారు. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ విజయభాస్కర్ అధ్యక్షతన గురువారం పంచాయతీ రాజ్ దినోత్సవం నిర్వహించారు. తహసీల్దార్ మునివేలు, ఈఓపీఆర్‌డీ దాస్, పశువైద్యాధికారి వెంకటరెడ్డి, పంచాయతీ రాజ్ జేఈఈ జగదీష్ హాజరయ్యారు. ముందుగా జాతీపిత మహాత్మా గాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్ళురించారు. ఉంతకల్లు గ్రామానికి చెందిన గ్రీన్ అంబాసిండర్లను సన్మానించారు.

శెట్టూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘురాంరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ సురేంద్రబాబు, ఏపీఓ నీరజ, ఈసీ రమణ, ఫీల్డ్ అసిస్టెంట్లు, డీలర్లు పాల్గొన్నారు.

బెళుగుప్ప: మండల కేంద్రంలోని పారిశుధ్య కార్మికులకు పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా సర్పంచ్ సాలిబాయి ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. పారిశుధ్య కార్మికులు నారాయణ స్వామి, వీరేష్, వీరన్న, కుమారస్వామి, వన్నూరస్వామి, ఎర్రిస్వామి, నాగరాజు, ఉమాపతి, కుళ్లాయస్వామిని సన్మానించారు. పంచాయితీ సెక్రటరీ శివరంజని, సచివాలయ వెల్ఫేర్ అధికారి దేవేంద్ర, మాజీ వైస్ ఎంపీపీ తిమ్మప్ప, మల్లికార్జున, అనిల్‌కుమార్ స్వామి ,గాంగ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

కంటి శస్త్రచికిత్సకు 25 మంది ఎంపిక

కణేకల్లు: కణేకల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 25 మందిని శస్త్రచికిత్స కోసం ఎంపిక చేసినట్లు లయన్స్‌క్లబ్ నిర్వాహకులు తెలిపారు. బెంగళూరుకు చెందిన శంకర కంటి ఆస్పత్రి కంటి వైద్యులు, సిబ్బంది కంటి వైద్యపరీక్షలు చేశారు. 35 మందిలో 25 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేసినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వేలూరు మరియప్ప తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వేలూరు మరియప్ప, కో ఆర్డినేటర్ ఆనంద్‌రాజ్, కార్యదర్శి చాంద్ బాషా, డైరెక్టర్లు ఆది, మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.